క్లుప్తంగా

గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని పెనుమాకలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ ఇన్ ఎకనామిక్స్ పోస్టుకు అర్హత గల అభ్యర్థులు ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవలసినదిగా, 25న ఇంటర్వ్యూలు ఉంటాయని మరింత సమాచారం కొరకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నవులూరు(మంగళగిరి): పేదల ఆరోగ్యం, సంరక్షణే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ గ్రామ అధ్యక్షుడు రుద్రు కోటేశ్వరరావు తెలిపారు. గురువారం మండలంలోని నవులూరు గ్రామంలో బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. లబ్ధిదారులు గరికపాటి వర్షితశ్రీకి రూ.31,934, హరిలలిత ప్రత్యూషకు రూ.68,283, పల్లవికి రూ.23 వేలు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లవరపు వెంకట్, వేమూరి మైనర్‌బాబు, రుద్రు శ్రీను, కొల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఫిరంగిపురం: కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని, భూ యజమాని సంతకంతో పని లేకుండా కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం నాయకులు డిమాండు చేశారు. మండలంలోని పొనుగుపాడు గ్రామంలో కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సచివాలయ సిబ్బందికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలన్నారు. అదేవిధంగా గ్రామంలో ఉపాధి హామీ కూలీల బకాయిలు వెంటనే మంజూరు చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం నాయకులు జి.వెంకటేశ్వరరావు, కె.కోటేశ్వరరావు, వై.కృష్ణ, కె.తిరుపతిరావు, ఎం.శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

జోనల్ స్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాల పంట



దుగ్గిరాల: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన జోనల్ స్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో పాఠశాలకు చెందిన ఐదుగురు పతకాలు సాధించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు బి.వెంకట కృష్ణారావు అన్నారు. రేవేంద్రపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 69 కేజీల విభాగంలో వి.రితిక బ్రాంజ్, 58 కేజీల విభాగంలో టి.దివ్యలక్ష్మి బ్రాంజ్, 77 కేజీల విభాగంలో ఎస్.కె.జాస్మిన్ బ్రాంజ్, 86 కేజీల విభాగంలో ఎస్.ఆశాజ్యోతి గోల్డ్ మెడల్, ఎస్.కె.హర్షిత సిల్వర్ మెడల్ సాధించారు. ఆశాజ్యోతి, హర్షిత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.

గ్రేటనాల్టెస్‌లో కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు



దుగ్గిరాల: మండలంలోని మోరంపూడి గ్రామం గ్రేటనాల్టెస్‌లో జర్మన్ లెప్రసీ రిలీఫ్ అసోసియేషన్ సహకారంతో కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు గురువారం జరిగింది. వైద్యశాలలో ఇన్ పేషంట్ ఔట్ పేషంట్ సేవలను జాతీయ మెడికల్ అడ్వైజర్ డాక్టర్ అశీష్ వా, జర్మనీ లెప్రసీ రిలీఫ్ అసోసియేషన్ ఇండియా డాక్టర్ శ్రీలేఖ పెన్నా, ప్రారంభించారు. అశీష్‌వా ముందుగా సేవలు వివరాల బ్రోచర్‌ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుష్టు రోగులకు అల్సర్ డ్రెస్సింగ్, అంగవైకల్యం తీవ్రరూపం దాల్చకుండా తగు జాగ్రత్తలు తీసుకునే విధానాలను గ్రామాలలో స్కిన్‌క్లినిక్‌లు, పాత రోగులకు అవగాహన సదస్సుల నిర్వహణపై వివరించారు. కొత్త వ్యాధి గ్రస్తులను త్వరగా గుర్తించి చికిత్స అందించాలని తెలిపారు. అనంతరం రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రేటనాల్టెస్ చైర్మన్ జి.వి.రామ్ మోహనరావు, డైరెక్టర్ వంగర హేమ చందు, సాయి, గుంటూరు జిల్లా లెప్రసీ అధికారి శ్రీనివాసులు, ఇందిర, అబ్దుల్ ఇంతియాజ్, శివకుమార్, రవి పాల్గొన్నారు.

సీఆర్‌డీఏ అధికారుల
అనాలోచిత నిర్ణయాలే ముంపుకు కారణం

- ప్రభుత్వ నిర్లిప్తత వల్లే వేల ఎకరాల పంట నష్టం
- వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త వేమారెడ్డి



కొండవీటి వాగును పరిశీలించి ఇంజనీర్‌తో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త వేమారెడ్డి

నీరుకొండ(మంగళగిరి): సీఆర్‌డీఏ అధికారుల అనాలోచిత నిర్ణయాలు, ప్రభుత్వ నిర్లిప్తతతో కొండవీటి వాగు మళ్లించడమే వేల ఎకరాల పంట ముంపుకు ప్రధాన కారణమని వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. గురువారం నీరుకొండ గ్రామంలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ వద్ద రాజధాని అమరావతి భూముల్లో ఉన్న నీటిని బయటకు పంపేందుకు కొండవీటి వాగుకు మళ్లించేందుకు సీఆర్‌డీఏ అధికారులు తవ్విన కాలువలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ కురగల్లు వద్ద ప్రైవేటు యూనివర్సిటీలను ముంపు నుంచి కాపాడేందుకు వర్సిటీలకు రెండు కిలోమీటర్ల అవతల కాలువలు తీస్తున్నారని, అందువలన మరలా వర్షం వస్తే పంటలకు రక్షణ లేదని ముంపుకు గురవుతాయని అన్నారు. నీరుకొండ-కురగల్లు రోడ్డుకు దగ్గరలో కాలువ తీసి పై నుంచి వచ్చే నీటిని మళ్లించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా కాలువలు తీసి నీటిని మళ్లిస్తున్నారన్నారు. మేము రాజధాని అమరావతి ముంపుకు గురవుతుందంటే మా పై టీడీపీ వారు రాజధాని అంటే మాకు ఇష్టం లేదని తప్పుడు ప్రచారం చేశారన్నారు. ముంపుకు గురికాకపోతే మంత్రి నారాయణ తెల్లవార్లు రాజధాని గ్రామాల్లో తిరుగుతూ 20 జేసీబీలు, ప్రొక్లయినర్లతో కాలువలు ఎందుకు తవ్వాల్సి వచ్చిందని నిలదీశారు. ఇప్పటికైనా ఇంజనీరింగ్ అధికారులు, ప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకుని పంటలు ముంపుకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు నాలి వెంకట కృష్ణ, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నవ్యాంధ్ర రాజధానిలో కొనసాగుతున్న నయా దందా

- అడ్డుకుంటున్న టీడీపీ నాయకులు
- లేడీ డాన్‌లను రంగంలోకి దింపిన వైనం
- స్థానిక తమ్ముళ్లపై దౌర్జన్యం



షాపులో ఉన్న వస్తువులను మరోసారి బయట పడేసిన లేడీ డాన్‌లు

తాడేపల్లిరూరల్ : నవ్యాంధ్ర రాజధాని ముఖద్వారమైన ఉండవల్లి సెంటర్‌లో నయా దందా కొనసాగుతూనే ఉంది. గురువారం రెండవరోజు కూడా లేడీ డాన్‌లు వచ్చి దౌర్జన్యం చేసి షాపుల్లో ఉన్న వస్తువులు మరోసారి బయటకు విసిరివేశారు. ఇది తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు అక్కడకు చేరుకుని వారిని నివారించేందుకు ప్రయత్నించగా మేము మంత్రిగారి తాలూకా, మీ సంగతి తేలుస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. స్థానిక తమ్ముళ్లు కూడా ఏమీ తగ్గకుండా మా ఎమ్మెల్యే కూడా మంత్రినని ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ రౌడీయిజం ఏంటని ప్రశ్నించారు. అక్కడ ఉన్న లేడీడాన్‌లు తమ్ముళ్లపై చిందులు తొక్కారు. చివరకు తాడేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి రావడంతో అక్కడి నుంచి లేడీ డాన్‌లు జారుకున్నారు. చివరకు తమ్ముళ్లందరూ పోలీస్‌స్టేషన్‌కు చేరి తమకు న్యాయం చేయాలని కోరారు. కోర్టులో ఉండగా ఇలా వచ్చి రౌడీయిజం చేస్తే శాంతిభద్రతలకు భంగం కలుగుతుందని, మీరు పట్టించుకోకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. ఈ ఘటనపై పోలీసులు ఏమీ మాట్లాడకపోవడంతో తమ్ముళ్లు నిరాశ చెందారు. చివరకు వారిని శాంతపరిచేందుకు షాపు యజమానితో కూర్చోబెట్టి మాట్లాడించారు. ఒక షాపు వివాదంలో పలుమార్లు రౌడీలు, లేడీ డాన్‌లు రాడ్లు, కర్రలు తీసుకువచ్చి షాపుల తాళాలు పగలకొట్టి రౌడీయిజం చేస్తుంటే పోలీసులు దీనిపై విచారణ జరపకుండా సెటిల్‌మెంట్ చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటివి జరిగినపుడు వెంటనే పోలీసులు చర్యలు తీసుకోవాలని వ్యాపారస్తులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ధర్నా



సూపర్‌వైజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్



తహసీల్దార్ రాఘవరావుకు వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల నాయకులు రామకృష్ణ

తాడికొండ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పలువురు నినాదాలు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ నిర్మల కృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు, రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, అంగన్‌వాడీలు ప్రేమ కుమారి, రాజకుమారి, లక్ష్మీ దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో

దుగ్గిరాల: అంగన్‌వాడీల 42 రోజులు సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందంలో భాగంగా జీతాలు, మెనూ చార్జీలు పెంచాలని, యాప్‌ల భారం తగ్గించాలని పి.విజయలక్ష్మి అన్నారు. దుగ్గిరాలలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు, టీచర్లు మానవహారం నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ యాప్‌ల భారం తగ్గించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకు కూడా అమలు చేయాలని అన్నారు. అదనపు పనిభారంతో సతమతమవుతున్నామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా జీతాలు, మెనూ చార్జీలు పెంపుదల చేయలేదని, ఎటువంటి సంక్షేమ పథకాలు అందడం లేదని తెలిపారు. మార్చిలో ప్రకటించిన జీవో అమలు కావడం లేదని, నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోందని అన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరమ్మ, నాగమణి, సునీత, మీనారాజకుమారి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరులో...

మేడికొండూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలపై గత సంవత్సరం చేసిన సమ్మె కాలంలో ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలను సత్వరమే అమలు చేయాలని ప్రజాసంఘాల నాయకులు బొట్ల రామకృష్ణ ఆధ్వర్యంలో తహసీల్దార్ గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు జీతాలు, మెను చార్జీలు సంవత్సరం దాటినా పెంపుదల చేయలేదన్నారు. ఆయా గ్రామాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయలేదని అన్నారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు జరగడం లేదని అన్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ రాఘవరావుకి వినతిపత్రం మండల అంగన్‌వాడీ యూనియన్ సహాయ కార్యదర్శి పార్వతి అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో...

ఫిరంగిపురం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం సీడీపీవో కార్యాలయంలో సూపర్‌వైజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ప్రభుత్వం జీతాలు పెంపుదల చేయాలని కోరారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని రేషన్ కార్డులో మార్పులు చేర్పులకు అవకాశం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మంజుల, నక్షత్రం, కోటేశ్వరి, విజయశ్రీ, మీరాబీ, రజని, నాగలక్ష్మి, సీఐటీయూ మండల కార్యదర్శి మస్తాన్‌వలి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో అన్న క్యాంటీన్ భవన నిర్మాణం కోసం గురువారం ఎమ్మెల్యే టి.శ్రావణ్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ప్రతి పేదవాడి పొట్ట నిండేలా అన్న క్యాంటీన్ ద్వారా సేవలు అందజేస్తామని తెలిపారు. రోజువారి కూలీలు, పేదలకు నాణ్యమైన భోజనం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.కోటేశ్వరరావు, ఎం.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుగ్గిరాల: పెదపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త లైన్ల ఏర్పాటుకు 11 కేవీ పెదపాలెం ఫీడర్, పెరికలపూడి ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని దుగ్గిరాల ఏఈ ఎండీ సాధిక్ గురువారం తెలిపారు. పెదపాలెం, చినపాలెం, పెరికలపూడి, చుక్కవల్లివారిపాలెం గ్రామాల్లో గృహాలు, వ్యవసాయ పొలాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించవలసినదిగా ఆయన కోరారు.

అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు ఇవ్వాలి



దుగ్గిరాల: భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు అన్నారు. గురువారం చిలువూరు గ్రామ సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు కౌలు రైతులు పూర్తిగా నష్టపోయారని, వరి పొలానికి ఎద పెట్టడం ద్వారా పంట మొత్తం నష్టం జరిగిందని, ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు నష్ట పరిహారం అందించాలని కోరుతూ వినతిపత్రం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బి.అమ్మిరెడ్డి, చిరంజీవి, వి.చౌదరి, ఎం.నాగేశ్వరరావు, ప్రమీల, ఎం.కృష్ణవేణి, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా హాకీ టీంకు మేడికొండూరు విద్యార్థులు



మేడికొండూరు: ఇష్టపడి కష్టంతో ఆడే క్రీడాకారులకు లక్ష్యం దరి చేరుతుందని మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జయప్రద అన్నారు. మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన క్రీడాకారులు జిల్లా హాకీ జట్టుకు ఎంపికైన సందర్భంగా అభినందన సభ గురువారం జరిగింది. అత్యంత ప్రతిభ కనబరిచిన 11 మంది క్రీడాకారులు జిల్లా స్థాయి జోనల్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జయప్రద విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు రాణించాలని అన్నారు. క్రీడాకారులను, క్రీడాకారులకు శిక్షణ నిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు టి.వాణి సునీల, కే బాలకృష్ణలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థిని

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వక్తృత్వ పోటీలో ప్రతిభ చాటి గురువారం నగదు బహుమతిని కైవసం చేసుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొల్లపల్లి అనంత శివ మాట్లాడుతూ హరిత ఫౌండేషన్ తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం రామకృష్ణ మిషన్ స్కూల్‌లో డాక్టర్ అబ్దుల్ కలామ్ జీవిత చరిత్రపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కంజనం రాగప్రవల్లిక పాల్గొని, ద్వితీయ స్థానంలో నిలిచి రూ.3,000 నగదు బహుమతిని అందుకుందని తెలిపారు. రాగప్రవల్లికను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ప్రభుత్వాలు మారినా కార్మికుల జీవితాలు మారడం లేదు



తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడవద్దని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు హెచ్చరించారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన యూనియన్ నాయకులతో కలసి ప్రారంభించి మాట్లాడుతూ కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం సుమారు 30 సంవత్సరాలకు పైగా ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ చూపి సమస్యను పరిష్కరించడానికి ముందుకు రావాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ, పిచ్చయ్య, వై.సాంబశివరావు, సూర్యప్రకాశరావు, కార్మికులు శారద, రమణమ్మ, సువర్ణకుమారి, రమాదేవి, రిబ్కా, ఇమాంబి, నాగేశ్వరరావు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థతో పాటు నార్త్ జోన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి తీసుకోవడంతో పాటు మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మండపాల వద్ద ఎలాంటి ఘటన జరిగినా ఆయా కమిటీలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా, తొమ్మిది రోజులు పాటు జాగ్రత్తలు పాటిస్తూ పూజలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలీస్ నిబంధనలు ఉల్లంఘించి అసాంఘిక కార్యకలాపాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల కూడళ్లలో ఏర్పాటు చేసే మండపాల కారణంగా స్థానిక ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయంలో నిర్వాహకులు మండపాల వద్ద కాపలా ఉండాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 వరకు పూజల కొరకు మైకులు వినియోగించాలన్నారు. నిమజ్జన ఉత్సవంలో వృద్ధులు, పిల్లలు కాలువల వద్దకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలి



మంగళగిరిలోని దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మంగళగిరి టౌన్: పర్యావరణానికి ప్రమాదకరంగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వచ్ఛందంగా నిషేధించాలని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ బోర్డు ఈఈ నజీనా బేగం పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో పలు దుకాణాలు, హోటళ్లలో గురువారం తనిఖీలు నిర్వహించారు. మంగళగిరి మెయిన్ బజార్, ఆల్ఫా సెంటర్, గౌతమ బుద్ధ రోడ్, తాడేపల్లి పట్టణంలో తనిఖీలు చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్‌పై నిషేధం అందరూ స్వచ్ఛందంగా సామాజిక బాధ్యతతో పాటించాలని చెప్పారు. ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల మాట్లాడుతూ మంగళగిరి, తాడేపల్లిలో సుమారు 10 కేసులు నమోదు చేశామని, ఆయా దుకాణాల నుంచి 35 కేజీల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని రూ.34,800 ఫైన్ వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇందు, శానిటేషన్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



వ్యవసాయ శాఖ అధికారులు అందజేసిన మందుల ప్యాకెట్లతో రైతులు

జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు ఐ.సునీత



మాట్లాడుతున్న డీడీఏ సునీత

ఫిరంగిపురం: తమ పంటలకు రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు ఐ.సునీత అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా వనరుల కేంద్రంలో ప్రధానమంత్రి కృషి వికాస యువజన పథకం కింద రైతులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సునీత మాట్లాడుతూ జీవన ఎరువులయిన అజోస్ స్పిరిల్లం పాస్ఫేట్ బ్యాక్టీరియా పొటాష్ బ్యాక్టీరియా వంటి ద్రవ ఎరువులను వాడుకోవాలని, దీని ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. ఏవో వాసంతి మాట్లాడుతూ యూరియా కొరత లేదని, అధిక ధరలకు యూరియాను దుకాణదారులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ట్రైకోడెర్మావిరిడి మందులు రైతులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి రాజవంశీ, విస్తరణాధికారి షేక్ సుభాని, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూసారమే పంటకు ఆధారం

మేడికొండూరు: రైతులు రసాయనిక ఎరువులపై ఆధారపడటం తగ్గించి, భూసారాన్ని పరిరక్షించుకోవడంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ డీడీఏ సునీత పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పాలడుగు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భూమి ఆరోగ్యంగా ఉంటేనే పంట ఆరోగ్యంగా ఉంటుందని, భూసారాన్ని పెంచేందుకు వేసవిలో తప్పనిసరిగా పచ్చిరొట్ట విత్తనాలను వేసుకోవాలని సూచించారు. కేవలం 2 కిలోల ట్రైకోడెర్మా విరిడిని 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి పొలంలో వేయడం ద్వారా నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. ఏవో కె.లక్ష్మి మాట్లాడుతూ, ప్రస్తుత సీజన్‌లో పత్తి పంటను ఆశించే చీడపీడలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ రాజవంశీ, ఏఈఓ మురళి, గ్రామ వ్యవసాయ సహాయకులు, విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి



శివరాం భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

తాడేపల్లిరూరల్: పిల్లల కోసం, విద్యకోసం జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి శివరాం అని, అలాంటి వ్యక్తి మరొకరు లేరని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం కొనియాడారు. తాడేపల్లి నగర పరిధిలోని కుంచనపల్లి అరవింద స్కూల్‌లో గురువారం ప్రముఖ విద్యావేత్త శివరాం పార్థివదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి ఆయన పార్థివదేహాన్ని చూడడానికి వందల సంఖ్యలో అభిమానులు వచ్చారని అన్నారు. శివరాంతో తనకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని స్మరించుకుంటూ ఉద్వేగానికి లోనయ్యారు. శివరాం విద్యారంగంలో అసాధారణ కృషి చేశారని, ఆంధ్రప్రదేశ్‌లోనే కాక పలు రాష్ట్రాలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి విద్యా సంస్థలతో సంబంధాన్ని నెలకొల్పిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఇంతకాలం కన్నతల్లిలా చూసుకున్న ఇంద్రాణి త్యాగం, ప్రేమ వర్ణనాతీతం అని పేర్కొన్నారు. శివరాం సంస్మరణ సభ ఈ నెల 24న కుంచనపల్లి అరవింద స్కూల్‌లో జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీనియర్ పాత్రికేయులు అంబటి సురేంద్ర రాజు, ప్రముఖ చిత్రకారుడు రమణజీవి, అనంతపూర్ నుంచి కె.ఎం.నాయుడు, సోషలాజికల్ థాట్ రచయిత వెంకట మోహన్, ప్రజాశక్తి పబ్లిషింగ్ హౌస్ లక్ష్మయ్య, తరిమెల నాగిరెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి బసవరావు, అరసం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతి, అరవింద స్కూల్ కరస్పాండెంట్ ఇంద్రాణి, శివరాం బంధువులు, విద్యావేత్తలు, జర్నలిస్టులు, రచయితలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.